
వైసీపీ భక్త అధికారి ప్రభాకర్‌రెడ్డి ఎక్కడ?

- పోస్టింగ్ లేకుండానే పదవీ విరమణ చేసే అవకాశం

- అర్హత లేకున్నా సుదీర్ఘంగా జడ్పీ సీఈవో విధులు
- మైనార్టీ ఈడీగా విధులు స్వీకరించిన హరినాథరెడ్డి



మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా శుక్రవారం బాధ్యతు చేపట్టిన హరినాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది



ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు, జూన్ 14: వైసీపీ భక్త అధికారిగా ముద్ర పడిన పూర్వ జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ఎక్కడున్నారేది ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అర్హత లేకున్నా, కేవలం పెద్దిరెడ్డి అండతో సుదీర్ఘంగా జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా కొనసాగిన ఆయనమీద అనేక ఆరోపణలు వచ్చాయి.ఎన్నికల కోడ్ వచ్చాక ఆయన్ను సీఈవోగా తప్పించి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా పోస్టింగ్ ఇచ్చారు. ఆ పోస్టులో శుక్రవారం హరినాథ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. దీంతో ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న ప్రభాకర్‌రెడ్డి ఎక్కడున్నారనే చర్చ జరుగుతోంది. ఆయన సెలవులో ఉన్నారని అంటున్నా.. క్లారిటీ లేదు.

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరు చెప్పుకుని జిల్లా పరిషత్‌ను కనుసైగలతో శాసించిన ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి నేడు గాలిలో దీపంలా మారింది. పెద్దిరెడ్డి అండదండలతో సీఈవోగా, డిప్యూటీ సీఈవోగా, జిల్లా పరిషత్ ఏవోగా.. మూడు పోస్టులను ఏక కాలంలో నిర్వహించారు. ఇప్పుడేమో ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న ఆయన.. ఎక్కడా పోస్టింగ్ లేకుండా గడపాల్సిన విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకాశం జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎంగా ఉన్న గ్లోరియాను చిత్తూరు జడ్పీ సీఈవోగా నియమించింది. దీంతో ఆయన విధిలేని పరిస్థితుల్లో ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవోగా చెలామణి అయ్యేందుకు ప్రయత్నించారు. అప్పటికే డిప్యూటీ సీఈవోగా డీఎల్‌డీవో ఆదిశేషారెడ్డిని ప్రభుత్వం నియమించింది. దీంతో ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. జిల్లాలోనే కొనసాగాలనుకున్న ఆయన.. పెద్దిరెడ్డి ద్వారా కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో మైనార్టీ కార్పరేషన్ ఈడీ హరినాథరెడ్డిని బలవంతపు సెలవులో పంపించి.. ఆ పోస్టులో ఇన్‌చార్జిగా ఈయన్ను కూర్చోబెట్టారు. ఇదిలా ఉండగా శుక్రవారం దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లిన హరినాథరెడ్డి తిరిగి ఈడీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. దాంతో ఉన్న ఆ పోస్టు కూడా ఊడిపోవడంతో ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఐదేళ్లూ ప్రభాకర్‌రెడ్డిదే హవా

బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి వైసీపీ అధికారంలోకి రాగానే జడ్పీ సీఈవో పోస్టుపై కన్నేశారు. అప్పటికే పెద్దిరెడ్డితో ఉన్న సాన్నిహిత్యంతో తనకు సీఈవో పోస్టును ఇప్పించాలని కోరారు. తొలుత పెద్దిరెడ్డి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కావడంతో తనకు అనుకూలంగా ఉన్న ప్రభాకరెడ్డిని సీఈవో సీటులో కూర్చోబెట్టేశారు. మంత్రి కావడంతో అందుకు సంబంధించిన ఫైళ్లన్నీ చకచకా కదిలాయి. దీంతో జడ్పీలో మూడు ప్రధాన పోస్టులైన ఏవో, డిప్యూటీ సీఈవో, సీఈవో పోస్టులన్నీ ఆయన సొంతమయ్యాయి. సీఈవో సీటులో కూర్చున్న తరువాత జడ్పీని తన గుప్పిట్లోకి తీసుకున్నారు. చెప్పిన మాట వినని కింది స్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్ అర్డర్లు ఇస్తూ వచ్చారు. జడ్పీలో ఏ చిన్న ఫైల్ కదలాలన్నా ఈయన కనుసన్నల్లోనే జరగాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారు. అధికారులు, సీఈవో మధ్య అంతర్యుద్ధం జరిగింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ఆయన డీలా పడ్డారు.

టీడీపీ అధికారంలోకి రావడంతో..

వైసీపీ అధికారంలో ఉందని ఇన్నాళ్లు విర్రవీగిన ప్రభాకర్‌రెడ్డికి టీడీపీ అధికారంలోకి రావడంతో ముళ్లకంచెపై పడ్డట్టు అయింది. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే తనను వ్యతిరేకించిన వారిమధ్యనే పదవీ విరమణ చేసుకుందామని ప్రభాకర్‌రెడ్డి అనుకున్నారు. కానీ, ఇప్పుడేమో మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా ఉన్న పోస్టును కూడా ప్రభాకర్‌రెడ్డి కోల్పోవాల్సి వచ్చింది. తన ఒరిజనల్ పోస్టు బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా వెళ్లాల్సి ఉంది. గతంలో ఆయన జడ్పీ సీఈవోగా ఉన్నప్పుడు పలమనేరు ఎంపీడీవో ఆఫీస్ ఏవోను బైరెడ్డిపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఇప్పుడు ఆ పోస్టు కూడా ఖాళీగా లేదు. ఆ ఆదేశాలను రద్దు చేసి బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా తన ఒరిజనల్ ప్లేస్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం సీఈవోగా ఉన్న గ్లోరియా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ఆమె ప్రభాకర్‌రెడ్డికి అనుకూలంగా ఆర్డర్ ఇస్తారా.. లేదా.. అనేది వేచి చూడాల్సి ఉంది. దీంతో ఆయన పదవీ విరమణకు గడువున్న 15 రోజులు గాలిలో ఉండాల్సిందేనన్న మాటలు వినిపిస్తున్నాయి.

నేమ్ ప్లేట్ పగులగొట్టి..

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా ప్రభాకర్‌రెడ్డి ఉన్న కాలంలో టీడీపీ చెందిన కాంట్రాక్టర్ల బిల్లులను మంజూరు చేయకపోవడంతో పాటు కార్యాలయ ఉద్యోగులను వేధింపులకు గురి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, శుక్రవారం మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా హరినాథరెడ్డి బాధ్యతలు స్వీకరించగా కొందరు నాయకులు, విశ్రాంత ఉద్యోగులు అక్కడికి వెళ్లారు. కార్యాలయం వద్దనున్న ప్రభాకర్‌రెడ్డి నేమ్‌ప్లేట్‌ను చూసి ఆగ్రహంతో పగులగొట్టారు.



హోరుతప్ప ఓట్లేవి షర్మిలమ్మా?

- జిల్లాలో గెలుపోటములపై ప్రభావం చూపని కాంగ్రెస్ అభ్యర్థులు

చిత్తూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షర్మిల ప్రచార సభలు నిర్వహించిన నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్ పెద్దగా పుంజుకోలేదని తాజా ఎన్నికలు నిరూపిస్తున్నాయి. గత రెండు ఎన్నికల కంటే ఈసారి స్వల్పంగా ఓట్లు పెరగడం తప్ప ఏ నియోజకవర్గంలోనూ గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయి ఓట్లు కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు దక్కలేదు. ఏపీ న్యాయ్ యాత్ర పేరుతో జిల్లాలో ఏప్రిల్ 15న కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో షర్మిల పర్యటించారు. అంతకుముందు నగరిలోనూ ప్రచారం చేశారు. ఆమె పర్యటించిన ప్రాంతాల్లో ప్రజల నుంచి ఆదరణ కూడా లభించింది. దీంతో ఆమె ప్రభావం ఈసారి జిల్లాలో ఉంటుందని అంతా భావించారు. వైసీపీ ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థులు చీల్చుతారని ఆ పార్టీ అభ్యర్థులు ఆందోళన చెందారు. కానీ జిల్లాలో ఎక్కడా అటువంటి పరిస్థితే లేదు. చిత్తూరు ఎంపీ స్థానం విషయానికొస్తే.. 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రాజగోపాల్‌కు 16572 ఓట్లు, 2019లో పోటీ చేసిన రంగప్పకు 24643 ఓట్లు పోలయ్యాయి. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జగపతికి 30150 ఓట్లు పడ్డాయి.. అంటే స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. అలాగే జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే.. 2014లో 16442 ఓట్లు, 2019లో 16201 ఓట్లు, తాజా ఎన్నికల్లో 23241 ఓట్లు పోలయ్యాయి. అంటే గత ఎన్నికలతో పోల్చుకుంటటే 7040 ఓట్లు మాత్రమే ఆ పార్టీకి పెరిగాయి.

అలా వదిలేశారు

- మార్కెట్ యార్డుల్లో నిరుపయోగంగా పడున్న టమోటా గ్రేడింగ్ యంత్రాలు
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రూ.కోటికిపైగా ప్రజాధనం వృథా



నిరుపయోగంగా టమోటా గ్రేడింగ్‌యంత్రం

పలమనేరు, జూన్ 14: గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఐదు మార్కెట్ యార్డుల్లో కోటి రూపాయలకు పైగా విలువ చేసే టమోటా గ్రేడింగ్ యంత్రాలు వృథాగా పడున్నాయి. సుమారు 8 నెలల కిందట ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కలికిరి, గుర్రంకొండ, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మార్కెట్‌లలో ప్రతిరోజు వచ్చే వందలాది టన్నుల టమోటాలను గ్రేడింగ్ చేసేందుకు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఉత్తర భారత దేశం లో వినియోగించే గ్రేడింగ్ యంత్రాలను తెప్పించారు. ఒక్కో యంత్రం రూ.25 లక్షలకుపైగా ఉంటుంది. ఇంత పెద్ద ఎత్తున ప్రజాధనం వినియోగించి తీసుకు వచ్చిన యంత్రాలు నేడు ఎందుకూ కొరగాకుండా పడున్నాయి. ఈ మార్కెట్ యార్డులోని మండీల్లో కూలీలే సంప్రదాయ బద్ధంగా టమోటాలను గ్రేడింగ్ చేస్తున్నారు. నూతనంగా తీసుకు వచ్చిన గ్రేడింగ్‌యంత్రం ఒక గంటకు దాదాపు ఒక టన్ను టమోటాలను గ్రేడింగ్ చేసే సామర్థం ఉంది. ఈ యంత్రం వద్దకు మండీలకు వచ్చిన టమోటాలను తరలించి గ్రేడింగ్ యంత్రం ద్వారా వాటిని గ్రేడింగ్ చేయించడం మండీ వ్యాపారులకు ఎంతో శ్రమతో కూడిన పని. అంతేకాక ఈ యంత్రాలను నిర్వహించే బాధ్యతను అప్పటి ప్రభుత్వం సింగిల్ విండోలకు అప్పగించాలని సూచించింది. ఎక్కడా సింగిల్‌విండో వారు వీటి నిర్వహణకు ముందుకు రాలేదని తెలిసింది. అధికారులు కోటిరూపాయలకు పైగా మార్కెట్ యార్డుల్లో గ్రేడింగ్ యంత్రాలను ఏర్పాటు చేసే ముందు క్షేత్రస్థాయిలో ఈ గ్రేడింగ్ యంత్రాల వినియోగం సాధ్యమయ్యే పనేనా అన్న అవగాహన గానీ , పరిశీలన గానీ లేకుండానే తెప్పించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. భారీ మొత్తంలో కమీషన్లకు కక్కుర్తి పడి లేదా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వీటిని కొన్నారా అనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా, గత నెల 20న వీటి పనితీరును మార్కెటింగ్ శాఖ జిల్లా ప్రతినిధులు, టెక్నీషియన్లు వచ్చి పరిశీలించి వెళ్లారు. వారు కూడా వీటిని వినియోగంలోకి తెచ్చే విషయాల గురించి ఇక్కడి అధికారులకుసమాచారం కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వీటి కొనుగోళ్ల వ్యవహారంపై విచారణ జరిపి.. వీటి వినియోగానికి లేదా వాపస్‌కు చర్యలు తీసుకొంటే ప్రజాధనం సద్వినియోగం చేసిన వారవుతారని రైతులు అంటున్నారు.



పలమనేరు మార్కెట్‌యార్డులో వృథాగా పడున్న టమోటా గ్రేడింగ్ అనుబంధ లిఫ్టింగ్ యంత్రం



వృథాగా ఉన్న గ్రేడింగ్‌యంత్రాన్ని పరిశీలిస్తున్న టెక్నీషియన్లు (ఫైల్ ఫొటో)

మరణంలోనూ ఒక్కటిగా..!





ప్రమాద స్థలంలో పడున్న మృతదేహాలు



ప్రమాద స్థలంలో గుమికూడిన స్థానికులు

స్నేహితుడి జన్మదినానికి కేక్ తీసుకెళ్తుండగా ప్రమాదం

ముగ్గురు స్నేహితుల దుర్మరణం

చిత్తూరు రూరల్, జూన్ 14: ఆ ముగ్గురూ స్నేహితులు. తమ స్నేహితుడి జన్మదినం సందర్భంగా సందడి చేయాలని భావించారు. కాణిపాకం నుంచి కేకు తీసుకొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ ముగ్గురు స్నేహితులూ అక్కడికక్కడే మృతిచెందారు. మరణంలోనూ ఒక్కటిగా వెళ్లారంటూ గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషాద ఘటన శుక్రవారం రాత్రి చిత్తూరు సమీపం చెర్లోపల్లె వద్ద.. తిరుపతి- బెంగళూరు జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన ప్రకారం.. బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన స్నేహితులైన పవన్, మంజు, చరణ్ కలిసి వారి స్నేహితుడి జన్మదినానికి కేక్ తెచ్చేందుకు కాణిపాకం వెళ్లారు. శుక్రవారం రాత్రి కేక్ తీసుకొని ఈ ముగ్గురూ ద్విచక్ర వాహనంలో గ్రామానికి బయలుదేరారు. చెర్లోపల్లె వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న మినీ లారీని ఢీకొనడంతో ఆ ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో మహాసముద్రంలో విషాదం నెలకొంది.

ధర్మారెడ్డిపై తొలివేటు



ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతలనుంచి తప్పించిన ప్రభుత్వం

ఇకపై అదనపు ఈవో పోస్టుకే పరిమితం

టీటీడీ నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా శ్యామలరావు నియామకం

తిరుమల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలివేటు టీటీడీ ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) ఏవీ ధర్మారెడ్డిపై పడింది. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తిరుమలకు వచ్చిన చంద్రబాబు నాయుడు.. ఇక్కడ్నుంచే ప్రక్షాళన మొదలుపెడతామని చెప్పారు. ఆ ప్రకారం మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మినబంటుగా ఉన్న ధర్మారెడ్డి నుంచే యాక్షన్ మొదలైంది. టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతలనుంచి ధర్మారెడ్డిని తప్పించి.. కేవలం అడిషనల్ ఈవో స్థాయికి పరిమితం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న 1997 బ్యాచ్‌కు చెందిన జె.శ్యామలరావును టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం రాత్రి సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.



శ్యామలరావు

మళ్లీ తీవ్రవిమర్శలతో...

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో తొలిసారిగా ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలోకి వచ్చారు. అప్పట్లో ప్రత్యేకాధికారిగా పనిచేసిన ఈయనకు.. టీటీడీ ఉద్యోగుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఉద్యోగులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకుండా నిరంకుశంగా వ్యవహరించారనే విమర్శలు అప్పట్లో వచ్చాయి. ఓ వివాదాస్పద అంశంలో తీవ్రంగా కన్నీరుమున్నీరవుతూ ధర్మారెడ్డి టీటీడీని వీడారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రాగానే మళ్లీ టీటీడీకి వచ్చిన ఆయన వైఖరిలో ఎలాంటి మార్పులేకపోగా, మరింత మొండిగా వ్యవహరించారని ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఐదేళ్లలోనూ అదేస్థాయిలో విమర్శలను మూటగట్టుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో టీటీటీ ఈవో (ఎఫ్ఏసీ) నుంచి ఆయన్ను ప్రభుత్వం తప్పించింది.

వివాదాలకు కేంద్ర బిందువుగా..

వైసీపీ అధికారంలోకి రాగానే కేంద్ర సర్వీసుల్లో ఉన్న ధర్మారెడ్డిని డిప్యుటేషన్‌పై టీటీడీకి తీసుకొచ్చారు. తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ఈయన్ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ అప్పట్లో సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇతడి కోసం 'అదనపు ఈవో' అనే పోస్టు సృష్టించి నియమించారు. టీటీడీ ఈవోగా ఉన్న జవహర్‌రెడ్డి సీఎస్‌గా వెళ్లడంతో.. ధర్మారెడ్డి ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) పోస్టులోకి వచ్చారు. ఆ తర్వాత రెగ్యులర్ ఈవోను ప్రభుత్వం నియమించకుండా ఈయన్నే కొనసాగించింది. కనీసం తిరుమలకు జేఈవోనూ నియమించకపోవడం గమనార్హం. ఇలా జగన్ ప్రభుత్వం వెన్నుదన్నుతో టీటీడీలోకి వచ్చిన ధర్మారెడ్డి వివాదాస్పద నిర్ణయాలకు కేంద్రబిందువుగా మారారు. సీఎంకు దగ్గర వ్యక్తి కావడంతో గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కూడా లెక్కచేయని విధంగా నియంతృత్వ పోకడలతో వ్యవహరించారనే విమర్శలు లేకపోలేదు. సర్వదర్శనాలతో ఆదాయం పెద్దగా రాదనేలా వీఐపీ బ్రేక్ దర్శనాల టికెట్ల సంఖ్యను భారీగా పెంచేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్రేక్ దర్శనాల సమయాన్ని పెంచారు. దీనివల్ల సామాన్య భక్తుల క్యూలైన్లు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించేలా చేశారని విమర్శలపాలయ్యారు. ఇన్ని కిలోమీటర్ల మేరకు క్యూలైన్లు పెరిగినా ఏ రోజూ దర్శనాల సంఖ్య లక్షకు మించిన దాఖలాలు లేవు. వైసీపీ నేతలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లను ఇస్తూ సామాన్యులు దర్శనానికి రావాలంటే ఆలోచించే పరిస్థితులు తీసుకొచ్చారు. ప్రత్యేకించి దళారులను అరికడుతున్నామంటూ శ్రీవాణి ట్రస్టుతో రూ.10,500కు వీఐపీ బ్రేక్ టికెట్లు విక్రయించి ఆ ట్రస్టుకు వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి మళ్లిస్తున్నారనే విమర్శలకు కారకులయ్యారు. గతంలో సర్వదర్శన భక్తులకు కంపార్టుమెంట్లలో కడుపునిండా అన్నప్రసాదాలను అందించేవారు. దీనివల్ల అదనపు భారం పడుతోందనే కారణంతో వీటినీ తగ్గించారనే విమర్శలున్నాయి. కనీసం చంటిబిడ్డలకు పాలు కూడా అందడం లేదని భక్తుల నుంచి పలు సందర్భాల్లో ఆరోపణలు వచ్చాయి. క్యూలైన్‌లో తాగునీరు కూడా ఇవ్వలేదనే విమర్శలు ఎక్కువగానే ఉన్నాయి. టోకెన్ రహిత దర్శనాలను పూర్తిగా రద్దు చేసే దిశగా వ్యవహరించిన తీరు భక్తులను అసంతృప్తికి గురిచేసింది. ఏదోరకమైన టికెట్, టోకెన్ ఉంటేనే తిరుమలకు రావాలనేలా వ్యవహరించారు. వృద్ధులు, దివ్యాంగులు, అంగప్రదక్షిణ టికెట్లను ఆన్‌లైన్‌కే పరిమితం చేశారు. దీంతో చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు కిక్కిరిసిపోయేలా ఉండే క్యూలైన్లలోకి ప్రవేశించలేక దర్శనం లేకుండా తిరుగు ప్రయాణమైన సందర్భాలు చాలానే ఉన్నాయి. స్వామికి నైవేద్యంగా పెట్టే అన్నప్రసాదాలను దర్శనం పూర్తిచేసుకున్న భక్తులు ఇచ్చే సంప్రదాయాన్ని దూరం చేశారు. అన్నప్రసాదాల నాణ్యతపై పలుమార్లు భక్తులు మండిపడ్డారు. తమ సమస్యలపై ఉద్యోగులు బయటకు వచ్చి అందోళన చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకున్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే ఉద్యోగం నుంచి తొలగించడం, లేదా సస్పెండ్ చేయడం, ఒకచోట నుంచి మరోచోటికి బదిలీ చేసేలా వ్యవహరించారు.

వరసిద్ధుడి సేవలో సాయిధరమ్‌తేజ్



ఐరాల(కాణి పాకం), జూన్ 14: సినీ హీరో సాయిధరమ్‌తేజ్ శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి అయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, నాయకులు రాజ్‌కుమార్, యోగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడికి
వైజాగ్‌వాసి గుండె
'హృదయాలయం'లో 15వ శస్త్రచికిత్స



అంబులెన్సులో నుంచి గుండెను ఆస్పత్రిలోకి తీసుకెళుతున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 14: ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడి(22)కి బ్రెయిన్‌డెడ్‌కి గురైన వైజాగ్‌కి చెందిన వ్యక్తి(39) గుండెను అమర్చే శస్త్రచికిత్స తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో శుక్రవారం జరిగింది. ఇప్పటికే ఈ ఆస్పత్రిలో 14 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఇది 15వ శస్త్ర చికిత్స అని వైద్యులు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స పూర్తవడానికి ఆరు గంటలకుపైగా పడుతుందని పేర్కొన్నారు.

ఆ కుక్కలు దొరికాయి



ముదోల్‌హౌండ్ డాగ్స్‌తో నరేష్

పలమనేరు, జూన్ 14: పలమనేరు సమీపం గంటావూరు ఫ్లైఓవర్ వద్ద నివాసముంటున్న టమోటా మండీ వ్యాపారి నరేష్ పెంచుకొంటున్న అత్యంత ఖరీదైన రెండు ముదోల్‌హౌండ్ డాగ్స్ దొరికాయి. మూడురోజుల క్రితం వరండాలో ఉన్న వీటిని దుండగులు అపహరించుకెళ్లారు. దీనిపై అయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సోషల్ మీడియా ద్వారా ఈ కుక్కల ఆచూకీ బయటపడింది. అదెలా గంటే.. బైరెడ్డిపల్లె మండలం కంచనపల్లికి చెందిన ఒక వ్యక్తి ఈ కుక్కలను తీసుకువెళ్లి రూ. అదేమండలం కామినేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి 2 వేలకు అమ్మేశాడు. అతడు వీటిని పుంగనూరుకు చెందిన వ్యక్తికి రూ.5వేలకు అమ్మాడు. పుంగనూరుకు చెందిన వ్యక్తి తన వద్ద అరుదైన జాతికి చెందిన కుక్కలు అమ్మకానికి ఉన్నట్లు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది. ఈ విషయం నరేష్ దృష్టికి రాగా పుంగనూరుకు చెందిన వ్యక్తిని గుర్తించి నిలదీయడంతో ఈ డొంకంతా కదిలింది. ఇలా ముదోల్‌హౌండ్ కుక్కలు దొరికాయి.

పార్సిల్ సర్వీసు కార్యాలయంలో రూ.2.13 లక్షల చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14: లీలామహల్ సమీపంలో గురువారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు షట్టర్ పగులగొట్టి రూ.2.13 లక్షలు అపహరించుకుపోయారు. అలిపిరి సీఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. లీలామహల్ సెంటర్‌లో పార్సిల్ సర్వీసు కార్యాలయం ఉంది. రోజూ కొరియర్ డెలివరీ బాయ్‌లు తెచ్చే నగదును కార్యాలయంలో ఉంచుతారు. గురువారం కొరియర్ ద్వారా వసూలైన దాదాపు రూ.2.13 లక్షలను ఎప్పటిలాగే బీరువాలో భద్రపరచి తాళం వేసి వెళ్లారు. గమనించిన దుండగులు అర్ధరాత్రి ఇనుప రాడ్లతో షట్టర్ పగుల గొట్టి.. బీరువాలోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు లోడ్ వస్తుందని సిబ్బంది విధులకు హాజరయ్యారు. షట్టర్ పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నేతృత్వంలో క్లూస్ టీం, ఫ్రింగర్ ప్రింట్ అధికారులు చేరుకుని ఆధారాలు సేకరించారు. టీం లీడర్ చరిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృత వర్సిటీ పీఆర్వోగా రమేష్‌బాబు

తిరుపతి రూరల్, జూన్ 14: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ పీఆర్వోగా గణిత విభాగ ప్రొఫెసర్ వి.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటివరకు పీఆర్వోగా విశిష్టాద్వైత వేదాంత విభాగ ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి రాఘవన్ వ్యవహరించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రమేష్‌బాబు పీఆర్వోగా కొనసాగనున్నారు. రాఘవన్ మాట్లాడుతూ వర్సిటీలో ఉన్నతాధికార వర్గాలు, ప్రొఫెసర్లు, సిబ్బంది సమన్వయంతో స్నాతకోత్సవం, వార్షికోత్సవాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందుడి ఆలయంలో పుష్పయాగం



తిరుపతి (కల్చరల్), జూన్ 14: గోవిందరాజ స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వేడుకగా పుష్పయాగం జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్ధన రెడ్డి, ఏఈవో మునికృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పురుగులున్న నీళ్లు మీరు తాగుతారా..?

అధికారులపై మండిపడి పది నిమిషాల్లో ట్యాంకర్లు తెప్పించిన పూతలపట్టు ఎమ్మెల్యే



మురళీమోహన్‌కు సమస్యలు విన్నవిస్తున్న అధికారులు

పూతలపట్టు, జూన్ 14: 'పురుగులున్న తాగునీటిని మీరైతే తాగుతారా...? సామాన్య ప్రజలంటే మీకు అలుసా...' అంటూ మండల అధికారులపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మండిపడ్డారు. నీటి సరఫరా విషయంలో రాజకీయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండల కేంద్రంలోని పక్కాలగుట్టలో టీడీపీ సానుభూతిపరులకు నీళ్లు వదలడం లేదని తెలుసుకున్న ఆయన అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. 15 రోజులుగా నీళ్లు వదలడం లేదని, పురుగులు పడ్డ నీటిని తాగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. రెండ్రోజుల్లోపు నీటి ట్యాంకర్లను శుభ్రం చేసి, రోజూ నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. కమ్మగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని పేటపల్లి గ్రామంలో స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యువరాజులు నాయుడు, దొరబాబు చౌదరి, ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, నేతాజీ, విజయలక్ష్మి, చిరంజీవి, హిమకర్ నాయుడు, దగ్గుపాటి మోహన్, ప్రమోద్, శేషాద్రి నాయుడు, నల్లబోతు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో టీడీపీ కార్యకర్త మృతి



లింగయ్య (ఫైల్ ఫొటో)



లింగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పుంగనూరు రూరల్, జూన్ 14: రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. ఏం జరిగిందో ఏమో గానీ.. ఉదయానికి మృతిచెంది ఉన్నారు. ఇలా అనుమానాస్పద స్థితిలో టీడీపీ కార్యకర్త లింగయ్య మృతి చెందిన ఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. మండలంలోని ఆరడిగుంటకు చెందిన లింగయ్య(40) టీడీపీ కార్యకర్త. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంట్లో వాళ్లు నిద్రలేచి చూడగా లింగయ్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెదికారు. గ్రామ సమీపంలోని సచివాలయం వద్ద లింగప్ప మృతిచెంది ఉండగా గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులకు, టీడీపీ నాయకులకు కుటుబీకులు సమాచారం తెలియజేశారు. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లింగయ్య మృతిపై ఆరా తీశారు. అప్పటికే నాయకులు మాధవరెడ్డి, గంగాధర్, రెడ్డెప్పనాయుడు, ప్రసాద్‌స్వామితో పాటు పెద్దఎత్తున శ్రేణుఉ అక్కడికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లింగయ్య భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్యమనస్కంగానే...

- వైసీపీ భక్త అధికారుల్లో గుబులు
- స్థాన చలనం తప్పదనే ఆందోళన
- ఎమ్మెల్యే గుడ్ లుక్స్ కోసం పాట్లు
- గాడిన పడని పాలన

పుత్తూరు అర్బన్, జూన్ 14: పుత్తూరులో అధికారులు అన్య మనస్కంగా విధులు నిర్వహిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.ఎన్నికలవిధులుల్లో భాగంగా బదిలీపై వచ్చిన అధికారులు ఆ ఘట్టం కాస్తా పూర్తి కావడంతో తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారు. మరోవైపు వైసీపీ భక్త అధికారుల్లో బదిలీల భయం పట్టుకుంది. ఐదేళ్ల రూల్ ఆఫ్ లాకు విరుద్ధంగా వైసీపీ పెద్దల మోముల్లో ఆనందం చూడడమే విధులుగా భావించిన అధికారులు ఇక తమకు స్థానచలనం తప్పదనే అంచనాకు వచ్చేశారు. చివరి ప్రయత్నంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గుడ్ లుక్స్ కోసం స్థానిక టీడీపీ నాయకుల చుట్టూ ప్రదిక్షణం చేస్తున్నారు.ఈసంఘర్షణల నడుమ రోజువారీ విధులు కూడా సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నిర్లిప్తంగా విధులు

ఎన్నికల విధుల్లో భాగంగా పుత్తూరు బదిలీపై వచ్చిన ఒక రెవెన్యూ అధికారి రోజువారీ వచ్చే ప్రజల విజ్ఞాపనలు, సమస్యలను కూడా పరిష్కరించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఒక పోలీస్ అధికారి కూడా ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించ డంలేదనే మాటలు వినబడుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీనిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణ వాసులు అంటున్నారు. మున్సిపాలిటీకి చెందిన ఒక అధికారి ఇక తనకు బదిలీ తప్పదనే అంచనాకు వచ్చి విధులకు సక్రమంగా హాజరు కావడంలేదనే చర్చ జరుగుతోంది. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, నందిమంగళంలో ఇటీవల అతిసారా ప్రబలడానికి కారణమైందనే వాదనలు కూడా ఉన్నాయి. అలాగే తనకు ఎలాగూ జూలైలో ప్రమోషన్‌పై బదిలీ తప్పదని తెలుసుకున్న టౌన్ ప్లానింగ్‌కు చెందిన ఒక అధికారి విధి నిర్వహణ పట్ల పెద్దగా ఆసక్తి కనబరచడంలేదు. పైగా ఆమ్యామ్యాలు వచ్చే ఫైల్స్‌కు మాత్రమే క్లియరెన్స్ ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల తీరు కారణంగా పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.

ఎమ్మెల్యే గుడ్‌లుక్స్ కోసం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గుడ్‌లుక్స్ కోసం కొందరు కీలక అధికారులు తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. దీనికి స్థానిక టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆంతరంగికం తెలిసిన ఆ నాయకులు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నట్లు సమాచారం. రెండు రోజుల నుంచి తిరుపతిలో ఎమ్మెల్యే ఇంటికి అధికార యంత్రాంగం క్యూ కట్టింది. విడతల వారీగా అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వైసీపీ వీర భక్త అధికారులను తప్ప సాధారణ ఉద్యోగులను ఆప్యాయంగా పలకరిస్తున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీకి చెందిన కొందరు ఉద్యోగులు ఎమ్మెల్యేని కలవగా 'ఎలాంటి ఇబ్బంది లు ఉండవు... ప్రశాంతంగా విధులు నిర్వహించుకోండి' అని చెప్పినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా అధికారులు, ఉద్యోగులు అయితే ఆయన రిసీవ్ చేసుకున్న తీరుతో ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నరకం చూశామని, ఇప్పుడు ఎమ్మెల్యే అండగా ఉంటాననే భరోసా కల్పిస్తుండడంతో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని వారు ఆఫ్ ద రికార్డు పేర్కొంటున్నారు. మొత్తానికి వైసీపీ వీర భక్త అధికారుల్లో గుబులు మొదలవ్వగా, మిగిలిన సాధారణ ఉద్యోగుల్లో మాత్రం ఆనందం తొణికిసలాడుతోందనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ అంటకాగిన ఉద్యోగులను పక్కనబెట్టి పాలన గాడిన పడేందుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కసరత్తు మొదలుపెట్టాలనే అభిప్రాయాలు పట్టణవాసుల నుంచి వ్యక్తమవుతోంది.

మామిడి కాయల ట్రాక్టర్ బోల్తా



ట్రాలీ పైకిలేవడంతో బోల్తాపడిన ట్రాక్టరు

శ్రీరంగరాజపురం, జూన్ 14: మామిడి కాయల లోడ్‌తో స్పీడుగా వస్తోందా ట్రాక్టరు. ఇంతలో ఏం జరిగిందో గానీ హైడ్రాలిక్ ద్వారా ట్రాలీ పైకి లేచి.. ట్రాక్టరు నుంచి విడిపోయింది. ఈ ఘటనతో అదుపు తప్పిన ట్రాక్టరు బోల్తా పడింది. అందరూ చూస్తుండగానే.. క్షణాల్లో ఇలా ట్రాక్టరు బోల్తా పడటం.. స్వల్పగాయాలతో డ్రైవరు బయటపడటం జరిగిపోయింది. ఈ ఘటన శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఎస్‌ఆర్ పురం మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన రైతు ట్రాక్టరులో మామిడి కాయల లోడ్‌తో 49.కొత్తపల్లెమిట్టకు బయలుదేరారు. మార్గమధ్యంలో తిరుపతి రోడ్డుపై వస్తుండగా ట్రాలీ పైకి లేచి.. విడిపోవడంతో ట్రాక్టరు బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. కాగా, 49.కొత్తపల్లెమిట్టలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారి పక్కన అనుమతి లేకుండా అయిదు చోట్ల ర్యాంపులో మామిడి కాయలను విక్రయిస్తున్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

17మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 14: జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం 8 నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 17 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సోమలలో 13.8మి.మీ, నింద్ర 10.2, గంగవరం 9.4, తవణంపల్లె 7.4, రామకుప్పం 6.8, రొంపిచెర్ల 6.2, పుంగనూరు 6.2, బంగారుపాళ్యం 5.8, సదుం 5.2, చౌడేపల్లి 4.2, పెద్దపంజాణి 3.4, పలమనేరు 3.0, యాదమరి 3.0, పూతలపట్టు 2.4, చిత్తూరు రూరల్ 1.6, చిత్తూరు అర్బన్ 1.2, గంగాధరనెల్లూరు 1.0 మి.మీ నమోదైంది.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు

- గుత్తార్లపల్లెలో పరిశీలించిన రెవెన్యూ అధికారులు



గుడుపల్లె, జూన్ 13: గుడుపల్లె మండలం గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెలో గ్రానైట్ అక్రమ తవ్వకం ప్రాంతాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుత్తార్లపల్లెలో అక్రమ గ్రానైట్‌కు అడ్డుకట్ట వేయాలని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. కాగా, తహసీల్దారు సయ్యద్ షెబుద్దిన్ ఆదేశాలతో డీటీ కిరణ్ కుమార్ నాయక్, రెవెన్యూ అధికారుల బృందం నక్కనపల్లె రెవెన్యూలో సర్వే నెం.62లోని గుట్ట పొరంబోకు భూమిలో అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీనకు వెళ్లారు. అక్కడకు రెవెన్యూ అధికారులు వస్తున్నారని తెలుసుకున్న అక్రమార్కులు మైనింగ్‌కు ఉపయోగించే యంత్రాలను తీసుకెళ్లిపోయారు. అధికారులు గుట్ట పొరంబోకు భూమిలో రాతి సంపదను అక్రమార్కులు ఎక్కువ మొత్తంలో తరలించారని వారు గుర్తించారు. ఆ భూమిలో అక్రమార్కులు మైనింగ్‌కు వెళ్లే దారిలో ట్రంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ చేపడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగవంతం చేయండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఈ పనులపై సమీక్షించారు. నీటి సరఫరా, భూసేకరణ, పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆర్డీవో పెంచలకిషోర్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ వెంకటేష్, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి మధుసూదన్‌రావు, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

- జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: తిరుపతి జిల్లాలోని 11 కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 5,518మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందు కోసం 11 మంది లోకల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 11మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు జిల్లా అధికారులకు సమన్వయ అధికారులుగా బాధ్యతలు కేటాయించామన్నారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్లు(9000665565, 9676928804) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరన్నారు. ఆర్డీవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి పాపాలపై విచారణ కమిటీ నియమించాలి

- బాధితులకు న్యాయం చేసి దోషులను శిక్షించాలి
- సీఎం చంద్రబాబుకు రామచంద్రయాదవ్ లేఖ

పుంగనూరు, జూన్ 14: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అక్రమాలు, అరాచకాలు, దోపిడీ తదితర పాపాలపై విచారణ కమిటీ ద్వారా నిగ్గుతేల్చి చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్లు బీసీవైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్డీఏ కూటమి ఘనవిజయం చారిత్రాత్మకమని, సీఎం చంద్రబాబునాయుడుతో బాటు కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజ్యాంగేతర శక్తిగా రాష్ట్రంలో గనులు, క్వారీలు దోపిడీ, దాడులు, అరాచకాలు, అన్యాయం, అక్రమాలు, విద్యుత్ శాఖలో కాంట్రాక్టులు, ఒప్పందాలు, కేటాయింపులపై ప్రత్యేక కమిటీ వేసి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పుంగనూరు, కుప్పం, పలమనేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిల్లో తన అధికారాన్ని అడ్డంపెట్టుకుని అరాచకాలు చేస్తూ ముడా అథారిటీని అడ్డం పెట్టుకుని పెద్దిరెడ్డి కుటుంబీకులు, అనుచరులు చేసిన భూకబ్జాలు, ఆగడాలపై ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేయాని కోరినట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రతిపక్షపార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేలాదిమందిని వేధించినట్లు తెలిపారు. పెద్దిరెడ్డి అవినీతితో దోచుకున్నది కక్కించాలని, బాధితులకు న్యాయం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు వివరించారు.

ప్రభుత్వాస్పత్రిని వీడని నిర్లక్ష్యపు రోగం

- ఐదేళ్ల పాటు వైసీపీతో అంటకాగిన అధికారులు
- అదనపు అంతస్థు పేరుతో భారీ అవినీతి
- ప్రభుత్వం మారడంతో ప్రక్షాళనపై రోగుల ఆశలు

శ్రీకాళహస్తి, జూన్ 14: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి ఒక దశలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది. పేద ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్‌కు ధీటుగా ఖరీదైన వైద్యాన్ని గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనతో ఆస్పత్రికి నిర్లక్ష్యపు రోగం అలుముకుంది. వైసీపీ పాలకులతో కొందరు అధికారులు అంటకాగుతూ రోగులకు కనీస వైద్య సేవలను అందించకుండా విస్మరించారు. నాడు-నేడు పనులతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామంటూ వైసీపీ నేతలు ప్రకటిం చారు. తీరా ఒక అదనపు అంతస్తును నాసిరకం పనులతో నిర్మించి చేతులు దులుపుకున్నారు. తప్పును నిలదీయాల్సిన కొందరు అధికారులు వైసీపీతో అంటకాగి వారి పాపాలన్నింటిలో పాలుపంచుకుని ప్రస్తుతం ఏమి తెలియని అమయాకుల్లా చలామణి అవుతున్నారు.

మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రతిష్టాత్మకంగా 1999లో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిని నెలకొల్పారు. కార్పొరేట్‌కు ధీటుగా పేదలకు వైద్యసేవలు అందించాలన్న ఆశయంతో పదేళ్ల క్రితం గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆస్పత్రిని దత్తత తీసుకున్నారు. అధునాతన యంత్రాలు, పరికరాలతో ఆస్పత్రిని అభివృద్ధి చేశారు. ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధునాతన వైద్యసేవలు అందుతుండడంతో నియోజకవర్గం నుంచే కాకుండా పొరుగు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పేదలు శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చేవారు. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకసారిగా ఆస్పత్రిపై అవినీతి గ్రహణం అలుముకుంది. ధనార్జనే ధ్యేయంగా నాడు-నేడు పేరుతో పనులు చేపట్టారు. అత్యంత నాసిరకంగా ఒక అదనపు అంతస్తు మాత్రం నిర్మించి మమ అనిపించారు. అసలు వర్క్ ఆర్డరులో ఏయే పనులు చేయాలని నిర్ధేశించారో బయటకు వెల్లడించలేదు. అధికారులు, పాలకులు కలిసి గూడుపుఠాని సాగించారు. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా లిఫ్ట నిర్మించాలి. కానీ ఆ పని పూర్తి చేయలేదు. వర్క్ ఆర్డర్ ప్రకారం 24 ఏసీలు అమర్చాల్సి ఉండగా కానీ పాత ఏసీలతో కలిపితే ఆస్పత్రి భవనంలో కేవలం 14 ఏసీలు మాత్రమే ఉన్నట్లు అంచనా. అధికారులు, పాలకులు కలిసి సుమారు పది ఏసీలను సొంత అవసరాలకు తరలించుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో తారురోడ్లు అత్యంత దయనీయంగా దర్శనమిస్తున్నాయి. నాడు నేడు పనులు చేపట్టినా ఆస్పత్రిలో రోడ్లపై పిడికెడు కంకర దుమ్ము కూడా విదల్చలేదు. రూ.12కోట్ల నిధులతో కనీసం రోడ్లు లేకుండా ఏం అభివృద్ధి చేశారని ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపించే అంశాలు మాత్రమే. ఇక వర్క్‌ఆర్డరులో లోతుగా తోడితే నాడునేడు భారీగా అవినీతి వెలుగు చుసే అవకాశం ఉంది. చాలా వరకు పరికరాలు, ఇతర వసతులు, సౌకర్యాలు కల్పించకుండా నిధులను బొక్కేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతితో పాటు గాడి తప్పిన ఆస్పత్రి పాలన వైద్యసేవలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉందని ప్రజలు ప్రాధేయపడుతున్నారు.





నిర్మాణం పూర్తి కాని లిఫ్ట్ పనులు - ప్రభుత్వాస్పత్రిలో అధ్వానంగా ఉన్న రోడ్లు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

చంద్రబాబుకు బాబునాయుడి శుభాకాంక్షలు



గుడుపల్లె, జూన్ 13: ముఖ్యమంత్రిగా గురువారం చంద్రబాబునాయుడు అమరావతిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గుడుపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు బాబునాయుడు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో టీడీపీకి అత్యధిక మెజారిటీ రావడంతో చంద్రబాబు ఆయన్ను అభినందించారు.

చంద్రబాబు సీఎం అయ్యారని తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు కాలినడకన వెళుతున్న గణపతిని అభినందిస్తున్న కూటమి నేతలు

శాంతిపురం, జూన్ 14: చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మొక్కు తీర్చుకొనేందుకు తిరుమలకు పాదయాత్ర చేస్తున్న యువకుడిని శాంతిపురం మండల కూటమి నేతలు శుక్రవారం బడుగుమాకులపల్లె వద్ద ఘనంగా సన్మానించారు. కుప్పం మండలం చెక్కునత్తం గ్రామానికి చెందిన గణపతి బెంగళూరులో సాఫ్టవేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అత్యధిక సీట్లు గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే కాలినడకన తిరుమలకు వెళ్లి వెంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించి దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నాడు. అదే ప్రకారం శుక్రవారం తిరుమలకు పాదయాత్ర చేపట్టాడు. సాయంత్రం శాంతిపురం మండలం బడుగుమాకులపల్లె వద్దకు చేరుకోవడంతో ఆ యువకుడిని కూటమి నేతలు ఉదయకుమార్, జయ రామిరెడ్డి, నవీన్‌కుమార్, కేశవులు, గడ్డూరు రమేష్, జేసీబీ భాస్కర్‌నాయుడు, ఇతర నేతలు కలిసి ఘనంగా సన్మానించారు.

టీడీపీ నాయకులకు సన్మానాలు



:విశ్వనాథనాయుడును, ఇతర నాయకులను సన్మానిస్తున్న ఎంపీడీవో, ఉపాధి, మండల పరిషత్ సిబ్బంది

శాంతిపురం, జూన్ 14 : శాంతిపురం టీడీపీ కార్యాలయంలో అధికారుల సందడి పుంజుకుంది. శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ మైథిలి, సూపరింటెండెంట్ హేమమాలిని, ఈవోఆర్డీ రవినాయక్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది కలసి టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇతర టీడీపీ నాయకులను సన్మానించి అభినందనలు తెలి పారు. అలాగే ఉపాధి ఏపీడీ వెంకటరమణ, టీఏలు, ఎఫ్ఏలు ఇతర సిబ్బంది పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడుతో పాటు పార్టీ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉదయకుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, గోవిందరాజులు, భాస్కర్, బాలు, రమేష్, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ గౌనివారికి సన్మానం



శాంతిపురం, జూన్ 14 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించడంతో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులను మండల టీడీపీ మాజీ అధ్యక్షులు విజయ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణంరెడ్డి, కెనమాకులపల్లె యూనిట్ ఇన్‌చార్జి జయరామిరెడ్డి, టీడీపీ నేత సోమరామరెడ్డి, మాజీ తెలుగు యువత అధ్యక్షుడు కేశవులు, కెనమాకులపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడు రాజారెడ్డి సన్మానించారు. శుక్రవారం ఆయనను ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషివల్లే ఇంతటి ఘన విజయం సాధించామని వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, జూన్ 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

హంస వాహనంపై వేణుగోపాలుడి విహారం



గుడుపల్లె, జూన్ 14: హంస వాహనంపై వేణుగోపాలుడు శుక్రవారం విహరించి భక్తులను అనుగ్రహించారు. శెట్టిపల్లె గ్రామంలో కొలువైన వేణుగోపాల స్వామి ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, విశేషంగా పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలు, రంగు రంగుల పుష్పాలతో అలంకరించి హంసవాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, జూన్14: పుంగనూరు పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికెలు మొక్కులుగా చెల్లించారు.

చల్లా బాబును కలిసిన కమిషనర్



పుంగనూరు, జూన్ 14: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని శుక్రవారం పుంగ నూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రొంపిచెర్లలో ఆయన స్వగృహంలో కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడంతో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా సేవలు అందించాలని చల్లాబాబు సూచించినట్లు ఆయన తెలిపారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జూన్14: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి బెంగళూరుకు చెందిన అమ్మవారి భక్తురాలు బంగారు ముక్కపుడక బహూకరించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



కుప్పం, జూన్ 14: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన అబ్దుల్ గురు అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు జాకీర్, ఫైరోజ్, ఆర్ఆర్. రవిలు శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన భవ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి కూడా రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమర్, జాలు, తబ్రీజ్, లోకేశ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుకాల్వలో పశువైద్య శిబిరం



సోమల, జూన్ 14: పేటూరు పంచాయతీ ముచ్చు కాల్వలో సోమల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులునాయుడు, పెద్దఉప్పర పల్లె పశువైద్యా దికారి చందన ప్రియ ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 65 పశువులకు పిడుదల మందు పిచికారీ చేశారు. 15 దూడలకు, 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సిబ్బంది బలరాం, వెంకటరమణ, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

ఐదు సంతకాలతో స్వర్ణయుగం ప్రారంభం





చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శాంతారాం తదితరులు, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూన్ 14: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక చేసిన ఐదు సంతకాలతో ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణయుగం ప్రారంభమైందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. బాధ్యతల స్వీకరణ సందర్భాన్ని పురస్కరించుకుని కుప్పంలో శుక్రవారం టీడీపీ శ్రేణులు భారీ కేక్ చేశాయి. గంగమ్మ ఆలయం ఎదుట చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, పెన్షన్ రూ.4 వేలకు పెంపు, స్కిల్ సెన్సస్ ఫైళ్లపై చంద్రబాబు చేసిన అయిదు సంతకాలతో ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. అయిదేళ్ల సైకో జగన్ పాలనలోని చీకటి రోజులు అంతమై ఈ సంతకాలతో అభివృద్ధితోపాటు సంక్షేమ వెలుగులు సమానంగా ప్రసరించా యని హర్షం వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిగా ఇక రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి మొద లైందని పేర్కొన్నారు. ఇక ప్రజలంతా చంద్రన్న చల్లని పాలనలో సుఖసంతోషాలతో జీవిస్తారని భరోసానిచ్చారు.

● మొక్కులు తీర్చుకున్న నాయీ బ్రాహ్మణ సాధికార సమితి:

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి కీలకమైన ఐదు విధాన నిర్ణయాల ఫైళ్లపై సంతకాలు చేసిన నేపథ్యంలో నాయీబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకన్నారు. ఆలయం ఎదుట చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, సాయీబ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు జి.లక్ష్మీ దివాకర్, సుబ్రమణ్యం, వి.రమేష్, కృష్ణప్ప, రవి, లోకేశ్, ఎల్లప్ప, గంగరాజులు, జోతీశ్, మురుగేశ్, నాగేంద్రబాబు, సునీల్, అశోక్, చంద్రశేఖర్, శాంతిపురం అధ్యక్షుడు రామకృష్ణ, రాము, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్రగా తోటకనుమ తెలుగు తమ్ముళ్లు



వి.కోట, జూన్ 14: వి.కోట మండలం తోటకనుమకు చెందిన టీడీపీ శ్రేణులు తిరుమలకు పాదయాత్రగా పయనమయ్యారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే కాలినడకన తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటామని తోటకనుమ పంచాయతీకి చెందిన టీడీపీ అభిమానులు మొక్కుకున్నారు. ఆ కల నెరవేరడంతో పంచాయతీ పార్టీ నేతలతో కలసి మండల పరిధిలోని ఇతర గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. తోటకనుమలో ఆలయంలో పూజల అనంతరం పసుపు జెండాలను చేతపట్టి శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. తిరుమల వెళ్లిన వారిలో సుబ్రమణ్యం, నందకుమార్, నరేష్‌ల నేతృత్వంలో కార్తీక్, శివ, మోహనాచ్చారి, వరదప్ప, మల్లిఖార్జున, ఉదయ్‌కుమార్, శంకరప్ప, నారాయణ, గుర్రప్ప, ఇమ్రాన్ తదిరులు ఉన్నారు.

ఎన్నికల హామీలపై తొలిసంతకం అభినందనీయమం



స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్14: టీడీపీ ఎన్నికల హామీలపై తొలి సంతకం చేయడంతో పాటు అదనంగా హామీలు అమలు చేయడానికి చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు పుంగనూరు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పింఛన్ రూ.4వేలు ఒకేసారి పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఏడాదికి రూ.250 పెంచి వృద్ధులను, వితంతువులను మోసం చేసిందన్నారు. ప్రతినెలా పింఛన్ తీసుకోని వారికి మరుసటి నెలలో పింఛన్ ఇచ్చేవారుకాదని, టీడీపీ పాలనలో మూడు నెలల లోపు తీసుకోవడానికి వెసులుబాటు ఉందని వివరించారు. అన్నక్యాంటీన్ నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పేదలు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జి.రామయ్య, విజయకుమారి, కదిరప్ప, సిద్ధప్ప, వెంకటప్ప, పూల భాస్కర్, మంజునాథ్, సురేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పుంగనూరు రూరల్, జూన్14: పుంగనూరులో చైన్‌స్నాచర్లు మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. పట్టణంలోని హైస్కూల్ వీధిలో కాపురం ఉన్న పూల నారాయణస్వామి భార్య శకుంతల స్థానిక ఎంఎస్ఆర్ థియేటర్ సమీపంలో ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో దుకాణం మూసేసి భార్యాభర్తలు ఇద్దరూ కలసిఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి శకుంతల మెడలోని 30గ్రాముల బంగారు చైను లాక్కెళ్లారు. ఆమె కేకలు వేసే లోపు దుండగులు పరారయ్యారు.

చోరీలపై చలనం లేని పోలీసులు

పుంగనూరు పట్టణ పరిధిలో వరుస చోరీలతో పట్టణ ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వారం రోజుల క్రితం ప్రైవేటు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీకి గురైంది. ఆ విషయం మరవక ముందే ఇప్పుడు మళ్లీ చైన్‌స్నాచర్లు మహిళ మెడలో గొలుసును లాక్కెళ్లారు. బంగరు చైను దరించాలంటేనే మహిళలు భయపడిపోతున్నారు. పోలీసులు మాత్రం చైన్‌స్నాచర్లను పట్టుకోవడంలో విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

టీడీపీ నాయకుడికి చల్లా బాబు నివాళులు



సోమల, జూన్ 14: సోమల మండలం కమ్మపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మునిరెడ్డి ప్రసాద్ ఆకస్మికంగా గురువారం మృతి చెందాడు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆయన మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు సీ. సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, శ్రీనివాసులునాయుడు, మునీశ్వరరావు, రమేశ్ నాయుడు, పి.శివశంకర్, బాబురావ్, శివయ్యనాయుడు, సుధాకర్, మునిచంద్ర పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు

కుప్పం, జూన్ 14: రక్తదానం చేయడమంటే ఒక మనిషికి ప్రాణదానం చేయడమేనని పీఈఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్య, అగస్త్య క్యాంపస్ హెడ్ సురేశ్ అన్నారు. పీఈఎస్‌లో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో వక్తృత్వ, వ్యాస రచనలతోపాటు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దాతల నుంచి 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాథాలజీ హెచ్‌వోడీ ఏఎస్.రామస్వామి, ప్రొఫెసర్ డాక్టర్ కుమార్గురు, రక్త కేంద్రం ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరణ్య తదితరులు మాట్లాడారు. పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్. కృష్ణారావు, పాథాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ జయశ్రీ పవార్, డాక్టర్ విద్య, డాక్టర్ శోభిత, డాక్టర్ శరణ్య శంకర్, డాక్టర్ వీణ, డాక్టర్ మోనీశ్ రామ్, డాక్టర్ అర్చన, పీఈఎస్ యూజీ, పీజీ విద్యార్థులు, నర్సింగ్, హెల్త్ సైన్సెస్ కోర్సుల విద్యార్థులు పాల్గొన్నారు.

8 గంటలకే బక్రీద్ నమాజ్



మాట్లాడుతున్న అంజుమన్ కమిటీ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, జూన్ 14: ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 8గంటలకే బక్రీద్ పర్వదినం సందర్భంగా పుంగనూరులో నమాజ్ జరుగుతుందని సున్నీ అంజుమన్‌కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ బక్రీద్ రోజు ఉదయం 7-30 గంటలకు పోస్టాఫీస్ వద్ద నుంచి ముస్లింలు ప్రదర్శనగా వెళ్లి స్థానిక ఎన్ఎస్‌పేట బసవరాజ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సామూహికంగా ప్రార్థనలు చేస్తామని వివరించారు. సున్నీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనయతుల్లా షరీఫ్, సభ్యులు సద్దాం హుస్సేన్, బాబాఫక్రుద్దీన్, సమీ, ఖాజా, అంజాద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా కంటి పరీక్ష శిబిరం

కుప్పం, జూన్ 14: సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు కంటి ఆస్పత్రి వారిచే ఈ నెల 16వ తేదీన ఉచిత మెగా కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. కుప్పంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు జరిగే ఈ శిబిరంలో కంటి పరీక్ష, చికిత్సలతోపాటు కంటిలో శుక్లమున్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. వివరాలకు సాయిమాతా సేవాట్రస్టు ఫోన్ నెంబర్ 939183399 కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోరారు.

కీళ్ల మార్పిడికి రోబోటిక్ పద్ధతి అత్యంత సురక్షితం



మాట్లాడుతున్న మణిపాల్ ఆర్థోపెడిక్స్ డాక్టర్ దినేష్‌మన్ని, డాక్టర్ రాజారెడ్డి

పలమనేరు, జూన్14 : కీళ్ల మార్పిడికి రోబోటిక్ శస్త్ర చికిత్సా విధానం అత్యంత సురక్షితమని బెంగళూరులోని ప్రముఖ మణిపాల్ ఆస్పత్రి ఆర్థోపెడిక్స్ డాక్టర్ దినేష్ మన్ని, స్థానిక సీనియర్ డాక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులోని సాయిప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోబోటిక్ శస్త్రచికిత్స వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సాధారణ పద్ధతిలో మోకాళ్ల కీళ్ల మార్పిడి, తుంటి మార్పు శస్త్ర చికిత్సలు చేసుకోవడం వలన రక్తస్రావం అధికంగా ఉంటుందని, నొప్పి ఎక్కువగా ఉంటుందన్నారు. అలాగే రికవరీ సమయం ఎక్కువగా ఉంటుందన్నారు. రోబోటిక్ ఆపరేషన్‌తో పరిమితమైన రక్తస్రావంతో పాటు నొప్పి తక్కువగా ఉంటుందని వివరించారు. ఆపరేషన్ జరిగిన మరుసటి రోజునుంచే నడిచే అవకాశం ఉంటుందన్నారు. ఇక రికవరీ సమయం తక్కువ అన్నారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో కొన్ని చోట్ల తాగునీటిలో అధిక శాతం ఫ్లోరోసిస్ సమస్య ఉందని దీనివల్ల 45 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు ఓస్టియో ఆర్థరైటిస్ బారిన పడటం వలన మోకాళ్ల కీళ్ల సమస్య తలెత్తుతున్నట్లు గుర్తించామన్నారు. అంతేగాక ఒబిసిటీ వలన కూడా మోకాళ్ల కీళ్ల సమస్యలు వస్తున్నాయన్నారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డు సమీపంలోని వర్తూరురోడ్డు వద్ద ఉన్న మణిపాల్ ఆస్పత్రిలో మెకో రోబోటిక్ వ్యవస్థను మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేశామన్నారు. మొత్తం మోకాలి మార్పిడి, పాక్షిక మోకాలిమార్పిడి, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సల్లో రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని వివరించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన బరువు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మణిపాల్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుతో పేదల భూములకు రక్షణ

- చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు పాలాభిషేకం
- కేక్ కట్ చేసి న్యాయవాదులు
- పుంగనూరు, పలమనేరుల్లో సంబరాలు





పలమనేరు కేక్ కట్‌చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, పుంగనూరులో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు/ పలమనేరు జూన్14: ల్యాండ్ టైటిలింగ్ రహస్య చట్టాన్ని సీఎం చంద్రబాబు రద్దు చేయడంతో పేదల భూములకు రక్షణ కల్పించి ప్రజలకు మంచి చేశారని పుంగనూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు పేర్కొన్నారు. శుక్రవారం న్యాయవాదులు స్థానిక కోర్టు ఆవరణలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు 'జయహో చంద్రబాబు, జయహో పవన్‌కళ్యాణ్, థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ర్యాలీగా వెళ్లి సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ చట్టం రద్దుతో భూవివాదాలు పరిష్కరించడానికి మార్గం సుగమమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి.వెంకటమునియాదవ్, బాలాజీకుమార్, శరత్‌కుమార్, శైలేంద్రకుమార్, గిరిధర్, కుమార్‌రెడ్డి, నవీన్, గురుమూర్తి, శ్రీనివాసులు, రమణారెడ్డి పాల్గొన్నారు. ● పలమనేరులో న్యాయవాదులు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు సీఎంగా గురువారం బాధ్యతలు స్వీకరించగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ సంతకం చేశారు. ఈ క్రమంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.లక్ష్మీపతి, న్యాయవాదులు ఎల్. భాస్కర్, షేక్ షరీఫ్, ఎస్.లక్ష్మణ్, కె.జగదీష్, ఈ.క్రిష్టప్ప, ఈ.చంద్రశేఖర్, పీఆర్ లోకేష్, జె.సుబ్రమణ్యం, ఇబ్రహీం, ఇక్బాల్, రాజారెడ్డి, రెడ్డెప్పశెట్టి, గాంధీవనజాక్షి, చాందిని, పుష్పాంజలి, సంధ్య, రాజు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ దాడి


గాయపడిన జీవన్‌కుమార్, మోహన్‌కుమార్

శ్రీరంగరాజపురం, జూన్ 14: టీడీపీ సానుభూతిపరులైన యువకులపై వైసీపీ నాయకులు దాడి చేసిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. ఎస్‌ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట దళితవాడకు చెందిన టీడీపీ యువకులు జీవన్‌కుమార్, మోహన్ కుమార్‌లకు వైసీపీ చెందిన దొరవేలుతో ఎన్నికల విషయమై వాగ్వాదం జరిగింది. దొరవేలు అతని బావమరిది సురేష్‌కు, అతని కుమారుడు యశ్వంత్‌కు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి జీవన్ కుమార్, మోహన్ కుమార్‌పై దాడి చేశారు. ఇద్దరి చొక్కాలు చించేశారు. జీవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణపై గురిపెట్టాలి

చిత్తూరు (సెంట్రల్), జూన్ 14: ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణపై గురిపెట్టి రాణించాలని క్యాంపు కమాండింగ్ కల్నల్ మోనిష్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా శుక్రవారం స్థానిక పీవీకేఎన్ కళాశాల క్రీడా మైదానంలో క్యాడెట్లకు ఫైరింగ్, అబ్‌సైకిల్ విభాగాల్లో శిక్షణ ఇచ్చారు.

చంద్రబాబు హామీలన్నీ అమలు చేస్తారు

చిత్తూరు సిటీ, జూన్ 14: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే కీలకమైన ఐదు హామీలపై సంతకాలు చేయడంపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మార్కు పాలన మొదలైందని, రాష్ట్రంలో ఇకపై ప్రజాహిత కార్యక్రమాలే ఉంటాయని, కక్ష సాధింపు చర్యలు ఉండవని తెలిపారు.

ఏపీ హంస నగరి కమిటీ ఎన్నిక



నగరి, జూన్ 14: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ నగరి కమిటీ నగరి తాలుకా యూనిట్‌ను శుక్రవారం నగరిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో యూనిట్ అధ్యక్షుడిగా మునిశేఖర్, ఉపాధ్యక్షులుగా పుష్పవాణి, పుష్పలత, స్వప్న, మాధురి, ఆర్.కళ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీదేవి, తాలుకా కార్యదర్శిగా శ్రీనివాసులు నాయక్, కోశాధికారిగా సుధాకర్, ప్రచార కార్యదర్శిగా ఎం.సుధాకర్, మహిళా కార్యదర్శిగా ఎం.రాజరత్నమ్మ, కార్య నిర్వాహక కార్యదర్శిగా నంబి, మధు, జాయింట్ కార్యదర్శులుగా అమరావతి, ఐతేతుల్లా, పురుష శాంతి, సుమతి ఎన్నికయ్యారు.

అన్నాక్యాంటీన్ ప్రారంభానికి చర్యలు

చిత్తూరు, జూన్ 14: నగరంలోని కొంగారెడ్డిపల్లె వద్దనున్న అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. పునఃప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ నేతలు యువరాజులనాయుడు, గౌస్‌బాషా, మౌళి, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, డీఈలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విజయపురం, జూన్ 14: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చంద్రబాబు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈవీఎంలపై నెపం సరికాదు

కార్వేటినరగం, జూన్ 14: తమ ఓటమికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లే కారణమని జగన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యనించారు. కార్వేటినగరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2019లో ఇవే ఈవీఎంలే వైసీపీకి 151 అసెంబ్లీ స్థానాలు తెచ్చిపెట్టాయని, అప్పుడు రాని అనుమానం ఇప్పుడు ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. ఓడితే ఒక రకంగా, గెలిస్తే మరో రకంగా మాట్లాడడం సరికాదని హితవుపలికారు. విధ్వంసకర పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు.

సర్ది చెప్పబోతే చెప్పుతో కొట్టాడు

వెదురుకుప్పం, జూన్ 14: సర్దిచెబితే చెప్పుతో కొట్టిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కార్వేటినగరం సీఐ సత్యబాబు వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన వెంకటేష్ గురువారం పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయానికి వెళ్లి తనకు వైసీపీ ప్రభుత్వంలో జగనన్న తోడు ఐదేళ్లలో రెండేళ్ల మాత్రమే వచ్చి మిగతా మూడేళ్లు రాలేదని ఉద్యోగులతో గొడవపడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న చవనపల్లెకు చెందిన దామోదరరెడ్డి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా చెప్పుతో కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

చిత్తూరు నగరాభివృద్ధికి సమష్టి కృషి : గురజాల


మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న జగన్మోహన్

చిత్తూరు/చిత్తూరు కల్చరల్/గుడిపాల, జూన్ 14: చిత్తూరు నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యేగా ఎన్నికైన గురజాల జగన్మోహన్ నాయుడు కోరారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కమిషనర్ అరుణతో కలిసి నగర పాలక సంస్థ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, మెప్మా విభాగాల గురించి అడిగి తెలుసుకుని, అభివృద్ధి పనులపై దిశా నిర్దేశం చేశారు. నగరపాలక సంస్థను ఉత్తమంగా, ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. అంతకుముందు కమిషనర్ అరుణ పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్వో గోపాల కృష్ణవర్మ, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. కాగా, స్థానిక దర్గా సర్కిల్‌లోని బి.ఎస్.కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం జగన్మోహన్ వసుంధర బాహుబలి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుడిపాల మండలంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు.

కాణిపాక ఆలయాభివృద్ధికి సహకరించండి


మురళీమోహన్‌ను సన్మానిస్తున్న ఈవో వెంకటేశు

ఐరాల(కాణిపాకం)/ యాదమరి/ పూతలపట్టు, జూన్ 14: కాణిపాక ఆలయాభివృద్ధికి సహకరించాలని ఈవో వెంకటేశు పూతలపట్టు ఎమ్మెల్యేగా ఎన్నికైన కలికిరి మురళీమోహన్‌ను కోరారు. చిత్తూరులోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూరకంగా కలిసి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించి ఆశీర్వదించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, గంగారపు హరిబాబునాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు. ఇదిలావుండగా మురళీ మోహన్‌ను యాదమరి వడ్డెర సాధికార సమితి నాయకులు, పూతలపట్టు జనసేన నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

టీడీపీ నేతల సంబరాలు



గంగాధరనెల్లూరు, జూన్ 14: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఐదింటిపై మొదటి రోజే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకాలు చేయడంతో మండలంలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. చిత్తూరు - పుత్తూరు రహదారి గంగాధరనెల్లూరు బస్టాపు కూడలిలో స్వీట్లు పంచారు. బాణసంచా పేల్చారు. వెంకటేష్, దేవసుందరం, స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్ కామసాని కోదండరెడ్డి, కారకట్టి దేవరాజులురెడ్డి, మునిరాజులయాదవ్, జ్యోతిరెడ్డి, విజయకుమార్ రెడ్డి, ఆంజినేయులుశెట్టి, గిరిబాబురెడ్డి, సునీల్, నెల్లేపల్లె సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శపథాన్ని నెగ్గించుకున్న చంద్రబాబు

అసెంబ్లీ సాక్షిగా గతంలో చంద్రబాబు అవమానానికి గురైనప్పటికీ శపథం చేసి మళ్లీ సీఎంగా అడుగు పెడుతుండడం సంతోషంగా ఉందని తెలుగు యువత జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హోంమంత్రికి శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, జూన్ 14: రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితకు రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షురాలు కార్జాల అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు అత్యున్నత ప్రాధాన్యతనిచ్చి కీలకమైన మంత్రిత్వ శాఖలను అప్పగించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

మోకాళ్లపై తిరుమలకు..



శ్రీరంగరాజపురం, జూన్ 14: చంద్రబాబు ముఖ్య మంత్రి కావడంతో ఎస్ఆర్ పురం మండలం 49 కొత్తపల్లిమిట్టకు చెందిన టీడీఈ సీనియర్ నేత రంగనాథరెడ్డి మనవడు పి.హర్షవర్ధన్ రెడ్డి శ్రీవారి దర్శనార్థం మోకాళ్లపై వెళ్లారు. శుక్రవారం ఉదయం శ్రీవారిమెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి మోకాళ్ల నడక ప్రారంభించి, తిరుమల చేరుకున్నారు.

వేడుకగా కొండచుట్టు తిరునాళ్ల



చిత్తూరు కల్చరల్, జూన్ 14: నగరంలోని తేనెబండ ముత్యాలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం కొండచుట్టు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు చేసి సింహ వాహనంపై గ్రామంలో ఊరేగించారు. అనంతరం బోడి కొండ వద్దకు తీసుకెళ్లి కొండచుట్టూ అమ్మవారిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రజా పాలనకు శ్రీకారం


నగరిలో భానుప్రకాష్‌కు కేక్ తినిపిస్తున్న మహిళలు

నగరి/నింద్ర, జూన్ 14: రాష్ట్రంలో ప్రజాపాలనకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తొలి విడత ఐదు సంతకాలు చేసి సుపరిపాలన ప్రారంభించారన్నారు. రాష్ట్రం ఇకపై సురక్షితంగా ఉంటుందని తెలిపారు. కాగా, భానుప్రకాష్‌ను శుక్రవారం నింద్ర మండలం నెట్టేరి టీడీపీ నాయకులు కలిసి సన్మానించారు. నెట్టేరిలో పార్టీ మెజారిటీకి కృషి చేసిన నాయకులను ఆయన అభినందించారు.

వైభవంగా అశ్వ వాహన సేవ



యాదమరి, జూన్ 14: యాదమరి వరద రాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పుష్ప కైంకర్యం, అలంకారాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వెన్నత్తాయ్ కన్నన్ తిరుక్కోళం నిర్వహించారు. పెళ్లికాని యువతులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారిని అత్యంత సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం



చిత్తూరు లీగల్, జూన్ 14: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌రు రద్దు చేయడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం న్యాయవాదుల సంఘం భవనంలో వారు మాట్లాడుతూ ఈ యాక్ట్ రద్దువల్ల కక్షిదారులకు మేలు చేకూరుతుందన్నారు. యాక్ట్‌ను రద్దుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం నాయకులు అశోక్ ఆనంద్ యాదవ్, విశ్వనాథ్, షఫీవుల్లా, లోకనాథం, శ్రీనివాసులు, భూప్రసన్న, గోమతి, స్వరూపలక్ష్మి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన సావిత్రమ్మ

శ్రీరంగరాజపురం, జూన్ 14: వాహనం ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మగుడి గ్రామానికి చెందిన సావిత్రమ్మ(65) ఉదయం చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు.

టీడీపీ నేత చంద్రశేఖర్‌కు బెయిల్



గుడిపాల, జూన్ 14: మండలంలోని మండ్యపూపరానికి చెందిన టీడీపీ నేత చంద్రశేఖర్‌కు శుక్రవారం జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మే 13న పోలింగ్ సమయంలో వైసీపీ, టీడీపీ మధ్య జరిగిన ఘర్షణల కారణంగా టీడీపీ నేత చంద్రశేఖర్‌పై అప్పటి ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి, రిమాండ్‌కు పంపారు. శుక్రవారం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆయన్ను పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తాం

● ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్


ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

చిత్తూరు సిటీ, జూన్14: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్‌లను శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మురళీమోహన్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయినా జర్నలిస్టు కుటుంబ సభ్యుడినేనని అన్నారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథన్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, కమిటీ సభ్యులు మహేష్, అభి, సీనియర్ జర్నలిస్టులు సుభాష్, మురళీకృష్ణ, కరీం, రమేష్, కాళి, దొరై, వీరరాఘవులు పాల్గొన్నారు.

సీఎంకు ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక కృతజ్ఞతలు

చిత్తూరు కల్చరల్, జూన్ 14: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అఖిల భారత ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం దర్గా సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు.

అమరావతి అభివృద్ధికి విరాళం

చిత్తూరు కల్చరల్, జూన్ 14: రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవులు ఐదువేల రుపాయలు విరాళంగా ముఖ్యమంత్రికి పంపారు. స్థానిక బ్యాంకులో డీడీ తీసి రిజస్టర్ పోస్ట్ ద్వారా పంపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు.

ఆరణికి సన్మానం



చిత్తూరు లీగల్, జూన్ 14: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో చిత్తూరుకు చెందిన సీనియర్ న్యాయవాది లీలావతి మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు.

ఆటోడ్రైవర్‌కు రిమాండ్

చిత్తూరు లీగల్, జూన్ 14: మద్యం తాగి ఆటో నడుపుతూ ఒకరి మృతికి కారకుడైన డ్రైవర్‌కు 3వ కోర్టు న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు. చిత్తూరు కలెక్టర్ బంగ్లా వద్ద నివాసముంటున్న నాగరాజు ఆటో డ్రైవర్. గతనెల 28వ తేదీన మద్యం తాగి, ఆటో నడుపుతూ ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఆటోలో ప్రయాణిస్తున్న కనకమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదు చేసి, ఆటోడ్రైవర్‌ను 3వ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి మాధవీలత అతనికి 14రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సీఎం రమేష్‌ను కలసిన హేమలత



చిత్తూరు సిటీ/పెనుమూరు, జూన్ 14: అనకాపల్లి ఎంపీగా ఎన్నికైన సీఎం రమేష్‌ను చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత శుక్రవారం మర్యదపూర్వకంగా కలిశారు. చిత్తూరులోని బీవీ రెడ్డి కాలనీలో తమ బంధువుల నివాసానికి వచ్చిన రమేష్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. పెనుమూరు మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, చిత్తూరుకు చెందిన పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసు పెట్రోల్ బంకులో ఉద్యోగాలు

చిత్తూరు, జూన్ 14: నగరంలోని దర్గాకూడలిలో ఉన్న పోలీసు శాఖ వెల్ఫేర్ పెట్రోల్ బంకులో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న ఎంటీవో ఆఫీస్‌లో తనను కలవాలని ఎంటీవో భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9491074516ను సంప్రదించాలని తెలిపారు.

శబరిమలైకు పాదయాత్ర

యాదమరి, జూన్ 14: మండలంలోని కె.గొల్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శ్రీనివాసులు మందడి, కాశిరాళ్లకు చెందిన శేఖర్, రంగనాథం, ఎతిరాజులతోపాటు పలువురు గ్రామసుస్థులు శబరిమలైకు పాదయాత్రగా బయలుదేరారు. టీడీపీ విజయం సాధిస్తే పాదయాత్రగా వస్తామని వేడుకున్నారు. ఆ మేరకు మొక్కు తీర్చడానికి బయలుదేరారు.